క్లుప్తంగా

ఇన్‌చార్జ్ ఎంపీడీఓగా శంకరరావు


బాధ్యతలు స్వీకరిస్తున్న శంకరరావు

రేగిడి: ఇన్‌చార్జ్ ఎంపీడీఓగా బాసూరి శంకరరావు గురువారం బాధ్యతలు చేపట్టారు. ఇక్కడ ఎంపీడీఓగా పనిచేసిన జి.కాశీవిశ్వనాథ రావు బదిలీపై అనకాపల్లి వెళ్లిపోగా, ఆయన స్థానంలో శంకరరావు ఇన్‌చార్జ్ బాధ్యతలు స్వీకరించారు. ప్రజాప్రతినిధులు, అధికారుల సహకారంతో మండల సమగ్రాభివృద్ధికి కృషి చేస్తానని ఆయన అన్నారు.

వృద్ధులకు పండ్లు, రొట్టెల పంపిణీ


వృద్ధులకు పండ్లు, రొట్టెలు పంపిణీ చేస్తున్న మురళీకృష్ణ

రాజాం సిటీ: పార్వతీపురం ఎమ్మెల్యే అలజంగి జోగారావు పుట్టినరోజు పురస్కరించుకుని, స్థానిక మల్లిఖార్జున కాలనీలోని అనాథ ఆశ్రమంలోని వృద్ధులకు బలిజిపేట మండలం వైఎస్సార్ సీపీ నాయకుడు పాలవలస మురళీకృష్ణ గురువారం పండ్లు, రొట్టెలు పంపిణీ చేశారు. కార్యక్రమంలో పాలవలస రాంబాబు, ఎస్.సింహాచలం తదితరులు పాల్గొన్నారు.

తలసేమియా వ్యాధిగ్రస్తులకు పెన్షన్లు మంజూరు


తలసేమియాతో బాధపడుతున్న చిన్నారులకు పెన్షన్ అందజేస్తున్న వైఎస్సార్ సీపీ నేతలు

రేగిడి: తలసేమియా వ్యాధితో బాధపడుతున్న మండలంలోని ఆమదాలవలస గ్రామానికి చెందిన చిన్నారులు అదపాక శరణ్య, అదపాక చరణ్‌లకు ప్రభుత్వం పెన్షన్లు మంజూరు చేసినట్లు వైఎస్సార్ సీపీ నేతలు మామిడి వేణునాయుడు, మామిడి రాంబాబు, సర్పంచ్ కొమిలి అప్పారావు గురువారం తెలిపారు. ఎమ్మెల్యే కంబాల జోగులు, ఎమ్మెల్సీ పాలవలస విక్రాంత్‌ల చొరవతో ఒక్కొక్కరికి నెలకు రూ.10 వేలు చొప్పున మంజూరైందని, ఆ నగదును వారి తల్లిదండ్రులకు గ్రామ సచివాలయ ఉద్యోగులు గురువారం అందజేశారు.

జేవీకే కిట్ల పరిశీలన


జగనన్న విద్యాకానుక కిట్లను పరిశీలిస్తున్న ఎంపీడీఓ రమామణి


రామభద్రపురం: స్థానిక జెడ్పీ ఉన్నత పాఠశాలలోని జగనన్న విద్యాకానుక కిట్ల(జేవీకే)ను ఎంపీడీఓ రమామణి ఎంఈఓ తిరుమలప్రసాద్‌తో కలిసి గురువారం పరిశీలించారు. పాఠశాలల పునఃప్రారంభం రోజే వీటిని విద్యార్థులకు అందేలా చర్యలు తీసుకోవాలని ఆమె సూచించారు. కార్యక్రమంలో సీఆర్‌పీలు రవికుమార్, నిర్మల తదితరులు పాల్గొన్నారు.

సేవలకు సత్కారం


శ్రీనివాసరావును సత్కరిస్తున్న హెల్పింగ్ హ్యాండ్స్ సొసైటీ సభ్యులు

రేగిడి: మండలంలోని అప్పాపురం గ్రామ పంచాయతీ అభివృద్ధికి కృషి చేస్తున్న సర్పంచ్ కరణం శ్రీనివాసరావు దంపతులను కృష్ణా జిల్లా గన్నవరం నియోజకవర్గానికి చెందిన హెల్పింగ్ హ్యాండ్స్ సొసైటీ గురువారం సత్కరించింది. పలు ప్రాంతాల్లో విశేష సేవలందిస్తున్న వారిని సొసైటీ ఆధ్వర్యంలో సన్మానించి, సాయం అందిస్తున్నామని సొసైటీ చైర్మన్ ఎస్.వెంకటి తెలిపారు. గ్రామంలో ప్రజలకు అవసరమైన మౌలిక సదుపాయాలు కల్పించడంలో సదరు సర్పంచ్ విశేష సేవలు అందిస్తున్నారని ప్రశంసించారు. కార్యక్రమంలో వీఆర్‌ఓ జగన్, సచివాలయ ఉద్యోగులు పాల్గొన్నారు.

నియామకపత్రం అందజేత


సూర్యారావుకి నియామకపత్రాన్ని అందజేస్తున్న తహసీల్దార్ రాజేశ్వరరావు, బొబ్బిలి ఏఎంసీ చైర్మన్ శ్రీనివాసరావు

తెర్లాం: మండలంలోని డి.గదబవలస గ్రామ రెవెన్యూ సహాయకుడు(వీఆర్‌ఏ)గా జంగం సూర్యారావుకు తహసీల్దార్ డోల రాజేశ్వరరావు, బొబ్బిలి ఏఎంసీ చైర్మన్ బొమ్మి శ్రీనివాసరావు, డి.గదబవలస మాజీ సర్పంచ్ వావిలపల్లి ఆదినారాయణ గురువారం నియామకపత్రం అందజేశారు. డి.గదబవలసకు చెందిన వీఆర్‌ఏ జంగం గురువులు కొన్ని నెలల క్రితం అనారోగ్యంతో మృతి చెందగా, ఆయన స్థానంలో ఆయన కుమారుడు సూర్యారావును కారుణ్య నియామకం ద్వారా వీఆర్‌ఏగా నియమించినట్లు తహసీల్దార్ తెలిపారు.

సీఎం జగన్‌తోనే అన్ని వర్గాలకు న్యాయం

- 'గడప గడపకు మన ప్రభుత్వం'లో ఎమ్మెల్యే కంబాల జోగులు


మెంతిపేటకాలనీలో ఇంటింటికీ వెళ్లి, ప్రభుత్వ పథకాలు వివరిస్తున్న ఎమ్మెల్యే కంబాల జోగులు

రాజాం: సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డితోనే అన్ని వర్గాలకు సమన్యాయం జరుగుతోందని ఎమ్మెల్యే కంబాల జోగులు అన్నారు. గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో భాగంగా స్థానిక పట్టణంలోని ఆదర్శనగర్, మెంతిపేట కాలనీలో గురువారం పర్యటించిన ఆయనకు కాలనీవాసులు ఘనస్వాగతం పలికారు. అనంతరం ఇంటింటికీ వెళ్లిన ఆయన నాలుగేళ్లుగా ప్రభుత్వం చేస్తున్న అభివృద్ధి, అమలు చేస్తున్న పథకాలను వివరించారు. ఏవైనా సమస్యలున్నా, అర్హులై ఉండి ఎవరికైనా పథకాలు అందకపోయినా వెంటనే తెలియజేయాలన్నారు. రాష్ట్ర సర్వతోముఖాభివృద్ధి, ప్రజాసంక్షేమమే ప్రభుత్వ ధ్యేయమన్నారు. పార్టీ పదవుల్లోనూ, క్యాబినెట్‌లోనూ అన్ని వర్గాల వారికి ప్రాధాన్యమిస్తూ సీఎం జగనన్న న్యాయం చేశారన్నారు. ఆయన తన పాదయాత్ర మొదలుకుని, ప్రజాసంకల్పయాత్ర వరకు ప్రతీ ప్రాంతంలో తెలుసుకున్న ప్రజల కష్టాలను తీరుస్తూ పాలన కొనసాగిస్తున్నారన్నారు. సచివాలయ వ్యవస్థతో ప్రజల వద్దకు ప్రభుత్వ సేవలు, వలంటీర్ వ్యవస్థ ద్వారా పారదర్శకంగా లబ్ధిదారుల వద్దకే పథకాలు అందిస్తున్న ఘనత ఆయనదేనన్నారు. కుల, మత, రాజకీయ పార్టీలకు అతీతంగా, పారదర్శకంగా పథకాలు అందిస్తున్న తీరు దేశానికే ఆదర్శమన్నారు. ఇప్పటివరకు ఎన్నికల మేనిఫెస్టోలోని దాదాపు 98 శాతం హామీలను ప్రభుత్వం నెరవేర్చిందన్నారు. గతంలో టీడీపీ హయాంలో ఏ ఒక్క పథకం కావాలన్నా ఆ పార్టీ జన్మభూమి కమిటీల చుట్టూ ప్రదక్షిణలు చేయాల్సి వచ్చేదన్నారు. ప్రజలకు ప్రభుత్వం చేస్తున్న మేలును చూసి, ఓర్వలేకనే ప్రతిపక్షాలు లేనిపోని ఆరోపణలు చేస్తున్నాయని విమర్శించారు. టీడీపీ మాయ మాటలు, దాని కాపీ మేనిఫెస్టోను ప్రజలు ఎప్పటికీ నమ్మరన్నారు. వచ్చే ఎన్నికల్లోనూ ఇదే ప్రభుత్వాన్ని ఆశీర్వదించి, సీఎం జగన్‌ను మళ్లీ ముఖ్యమంత్రిని చేయాలని కోరారు. కార్యక్రమంలో పార్టీ రాజాం పట్టణ కన్వీనర్ పి.శ్రీనివాసరావు, మున్సిపల్ కమిషనర్ డీటీవీ కృష్ణారావు, పబ్లిక్ హెల్త్ ఇన్‌స్పెక్టర్ సీహెచ్ ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

రాజాం చేరిన ప్రచార జాతా ర్యాలీ


ర్యాలీలో మున్సిపల్ ఎంప్లాయీస్ ఫెడరేషన్ నాయకులు, మున్సిపల్ కార్మికులు

రాజాం సిటీ: మున్సిపల్ ఉద్యోగుల సమస్యల పరిష్కారమే లక్ష్యంగా చేపట్టిన రాష్ట్ర ప్రచార జాతా ర్యాలీ గురువారం రాజాం చేరుకుంది. మున్సిపల్ ఎంప్లాయీస్ ఫెడరేషన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కె.ఉమామహేశ్వరరావు మాట్లాడుతూ కాంట్రాక్ట్, ఔట్‌సోర్సింగ్ ప్రాతిపదికన పనిచేస్తున్న వారిని పర్మినెంట్ చేయాలని, 010 పద్దు కింద వేతనాలు చెల్లించాలని, టైంస్కేల్ వర్తింపజేయాలని, పట్టణాల విస్తరణ మేరకు సిబ్బంది సంఖ్యను పెంచాలని, రక్షణ భద్రతా సదుపాయాలు, పనిముట్లు సకాలంలో కల్పించాలని కోరారు. అనంతరం మెయిన్‌రోడ్డులో ర్యాలీ నిర్వహించి, హక్కుల సాధనకు పోరాటానికి సిద్ధం కావాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో సీహెచ్ రామ్మూర్తినాయుడు, రాజేష్, గిరి, కనకరాజు, చిన్నబాబు, దొరబాబు, హరి, శారద, ప్రసన్న తదితరులు పాల్గొన్నారు.

నేడు నెమలాంలో గడప గడపకు..

తెర్లాం: మండలంలోని నెమలాం గ్రామంలో శుక్రవారం గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు ఎంపీడీఓ శంబంగి రామకృష్ణ గురువారం ఓ ప్రకటనలో తెలిపారు. సాయంత్రం 4 గంటలకు జరిగిన ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యే శంబంగి వెంకటచిన అప్పలనాయుడు పాల్గొంటారని, మండల స్థాయి అధికారులంతా హాజరు కావాలని కోరారు.

శరవేగంగా సీసీ రోడ్డు నిర్మాణం


రాజయ్యపేటలో జరుగుతున్న సీసీ రోడ్డు నిర్మాణం

తెర్లాం: మండలంలోని రాజయ్యపేటలో గడప గడపకు మన ప్రభుత్వం నిధులతో చేపడుతున్న సీసీ రోడ్డు నిర్మాణ పనులు శరవేగంగా జరుగుతున్నాయి. మాజీ సర్పంచ్ గవర సత్యవతి ఆధ్వర్యంలో జరుగుతున్న ఈ పనులను మండల ఇంజినీరింగ్ అధికారి ఆర్నిపల్లి రాజశేఖర్ పర్యవేక్షిస్తున్నారు.

నిర్దేశిత లక్ష్యాలు చేరుకోవాలి


రాజాం సిటీ: ఫీల్డ్ అసిస్టెంట్లకు సూచనలిస్తున్న ఎంపీడీఓ శంకరరావు

రాజాం సిటీ: మండలంలోని అన్ని గ్రామాల్లో జరుగుతున్న ఉపాధి హామీ పనులకు సంబంధించి, నిర్దేశిత లక్ష్యాలు చేరుకోవాలని ఎంపీడీఓ బాసూరి శంకరరావు తెలిపారు. గురువారం స్థానిక ఉపాధి హామీ కార్యాలయంలో ఫీల్డ్ అసిస్టెంట్లతో సమావేశమైన ఆయన మండలంలో ప్రతిరోజూ 9 వేల మందికి పైగా పనులకు హాజరయ్యేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. అలాగే ఎస్సీ, ఎస్టీ, దివ్యాంగులకు శతశాతం పని కల్పించాలన్నారు. ఉపాధి హామీ పథకం ద్వారా ఉద్యానవనాలకు సంబంధించి, 30 ఎకరాలు లక్ష్యం కాగా 11 ఎకరాల్లో మాత్రమే పనులు పూర్తయ్యాయని, మిగిలిన లక్ష్యాన్ని త్వరితగతిన పూర్తి చేయాలని తెలిపారు. అమృత్ సరోవర్ చెరువులను గ్రామస్తుల సహకారంతో అత్యంత సుందరంగా తీర్చిదిద్దాలని తెలిపారు. కార్యక్రమంలో ఏపీఓ కె.సాయిరాం తదితరులు పాల్గొన్నారు.

వడదెబ్బ బారినపడకుండా జాగ్రత్తలు తీసుకోవాలి


సూచనలు చేస్తున్న డాక్టర్ రాజారమేష్

బాడంగి: వడదెబ్బ బారినపడకుండా జాగ్రత్తలు తీసుకోవాలని సీహెచ్‌సీ ఇన్‌చార్జ్ డాక్టర్ రాజారమేష్ సూచించారు. స్థానిక పీహెచ్‌సీలో గురువారం విలేకరులతో మాట్లాడిన ఆయన ఎండలు ఎక్కువగా ఉన్న నేపథ్యంలో బయట ఎక్కువగా తిరగవద్దని సూచించారు. అత్యవసరమై బయటకు వెళ్తే గొడుగు, తాగునీరు వెంట తీసుకుని వెళ్లాలని తెలిపారు. తరచూ నీరు, మజ్జిగ, కొబ్బరినీరు తాగాలన్నారు.

తహసీల్దార్ బదిలీ


తహసీల్దార్ ఆదిబాబు

మెంటాడ: మండల తహసీల్దార్ ఉత్తరావల్లి ఆదిబాబు ఎల్‌కోట మండలానికి బదిలీ అయ్యారు. అక్కడ తహసీల్దార్‌గా విధులు నిర్వహిస్తున్న రామకృష్ణ మెంటాడ మండల తహసీల్దార్‌గా జాయిన్ అవుతారని ఆయన తెలిపారు.

బొబ్బిలి: బుడా(బొబ్బిలి అర్బన్ డెవలప్‌మెంట్ అథారిటీ) కార్యదర్శి డి.లక్ష్మి విశాఖ నగర పాలక సంస్థకు బదిలీ అయింది. ఈ మేరకు గురువారం సాయంత్రం ప్రభుత్వం నుంచి ఉత్తర్వులు వెలువడ్డాయి.

మెంతిపేటలో పారిశుద్ధ్య పనులు


మురుగు కాలువలో పూడికలు తొలగిస్తున్న పారిశుద్ధ్య కార్మికులు

రాజాం: పట్టణంలోని మెంతిపేటలో గురువారం పారిశుద్ధ్య పనులు చేపట్టారు. మురుగు కాలువల్లో పూడికలు తొలగించి, డంపింగ్ యార్డులకు తరలించారు. వర్షానికి కాలువలు నిండిపోయి, అందులోని మురుగు రోడ్డు మీదకు ప్రవహిస్తోందని ఈ విషయం ఎమ్మెల్యే కంబాల జోగులు దృష్టికి తీసుకువెళ్లగా, స్పందించిన ఎమ్మెల్యే మురుగుకాలువలు మొత్తం డిసిల్టేషన్ చేయాలని అధికారులను ఆదేశించారని గ్రామస్తులు తెలిపారు.

తల్లిదండ్రులను గౌరవించాలి


మాట్లాడుతున్న మండల విశ్రాంత ఎంఈఓ సత్యనారాయణ

తెర్లాం: ప్రతిఒక్కరూ చిన్నతనం నుంచే తల్లిదండ్రులను గౌరవించాలని మండల విశ్రాంత విద్యాశాఖాధికారి ఎం.సత్యనారాయణ సూచించారు. వేసవి విజ్ఞాన శిబిరాల్లో భాగంగా స్థానిక శాఖా గ్రంథాలయంలో ప్రపంచ తల్లిదండ్రుల దినోత్సవం గురువారం నిర్వహించారు. లైబ్రేరియన్ సీహెచ్ కృష్ణమూర్తి ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో పాల్గొన్న ఆయన జీవితంలో ఎన్ని కష్టాలు వచ్చినా, ఇబ్బందులు పడినా తల్లిదండ్రులను మాత్రం కంటికి రెప్పవలే కాపాడుకోవాలని తెలిపారు. జీవితంలో ఏది కోల్పోయినా మళ్లీ పొందవచ్చుగానీ, తల్లిదండ్రులను కోల్పోతే మళ్లీ జన్మ ఎత్తాల్సిందేనన్నారు.

చిన్నారులకు ఆరోగ్య తనిఖీలు


చిన్నారుల ఆరోగ్యంపై ఆరాతీస్తున్న పీహెచ్‌సీ వైద్యాధికారి రవికుమార్

తెర్లాం: మండలంలోని కుసుమూరు 1, 2 అంగన్‌వాడీ కేంద్రాల్లోని ప్రీస్కూల్ చిన్నారులకు గురువారం ఆరోగ్య తనిఖీలు చేపట్టారు. తెర్లాం పీహెచ్‌సీ వైద్యాధికారి రెడ్డి రవికుమార్ చిన్నారులకు అన్ని రకాల వైద్య పరీక్షలు చేసి, అవసరమైన వారికి ఉచితంగా మందులు పంపిణీ చేశారు. వేసవి ఎండలు ఎక్కువగా ఉన్నందున పిల్లలు వడదెబ్బకు గురికాకుండా జాగ్రత్తలు తీసుకోవాలని ఆయన సూచించారు. అంగన్‌వాడీ కేంద్రాల ద్వారా ప్రభుత్వం సరఫరా చేస్తున్న పౌష్టికాహారంతో చిన్నారులు సంపూర్ణ ఆరోగ్యవంతులుగా ఉంటారని, ప్రతినెలా పిల్లలకు ఆరోగ్య తనిఖీలు నిర్వహించాలని సూచించారు.

జోరుగా పెన్షన్ల పంపిణీ


తెర్లాం: దివ్యాంగురాలికి పెన్షన్ అందజేస్తున్న వలంటీర్ గౌరీశ్వరి


బాడంగి: చినభీమవరంలో వృద్ధురాలికి పెన్షన్ అందిస్తున్న వలంటీర్ స్వప్న


రేగిడి: వన్నలిలో వృద్ధురాలికి పెన్షన్ అందజేస్తున్న వలంటీర్


వంగర: ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న వ్యక్తికి పెన్షన్ అందజేస్తున్న వలంటీర్ అరంజ్యోతి

తెర్లాం: మండల వ్యాప్తంగా సామాజిక పెన్షన్ల పంపిణీ గురువారం జోరుగా సాగింది. ఎంపీడీఓ శంబంగి రామకృష్ణ, పంచాయతీ కార్యదర్శులు, వెల్ఫేర్ అసిస్టెంట్ల పర్యవేక్షణలో తెల్లవారుజాము నుంచే వలంటీర్లు లబ్ధిదారుల ఇళ్లకు వెళ్లి, బయోమెట్రిక్, ఐరిష్ వేసి, పెన్షన్ నగదు అందజేశారు. మండలంలోని 21 గ్రామ సచివాలయాల పరిధిలో మొత్తం 9,741 మంది లబ్ధిదారులు ఉండగా, 92 శాతం మందికి పెన్షన్లు అందజేసినట్లు అధికారులు తెలిపారు.

బాడంగి: మండలంలోని 18 గ్రామ సచివాలయాల పరిధిలో 81 శాతం మేర పెన్షన్లు పంపిణీ చేసినట్లు ఎంపీడీఓ అక్కారావు ఓ ప్రకటనలో గురువారం తెలిపారు. మండలంలో మొత్తం 8,477 మంది లబ్ధిదారులు ఉండగా, వారిలో 6,866 మందికి పెన్షన్లు అందజేశామని, ఈ నెల 5వ తేదీలోగా మిగిలి వారికి కూడా పెన్షన్లు అందిస్తామని పేర్కొన్నారు.

వంగర: రాజాం కేర్ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న వృద్ధురాలు దన్నాన అనసూయమ్మకు మండలంలోని కోణంగిపాడుకు చెందిన వలంటీర్ జి.అరంజ్యోతి గురువారం ఆమె వద్దకు వెళ్లి మరీ పెన్షన్ అందజేశారు. పని పట్ల ఆమెకున్న చిత్తశుద్ధి, నిబద్ధతను అందరూ మెచ్చుకుంటున్నారు.

రేగిడి: మండలంలోని అన్ని గ్రామ పంచాయతీల్లో గురువారం తెల్లవారుజాము నుంచే పెన్షన్ల పంపిణీ చేపట్టారు. వలంటీర్లంతా లబ్ధిదారుల ఇంటింటికీ వెళ్లి, పెన్షన్లు అందజేశారు. మండలంలో మొత్తం 10,833 మందికి గాను 8,146 మందికి పెన్షన్లు అందజేసినట్లు ఎంపీడీఓ బాసూరి శంకరరావు తెలిపారు.

సమసమాజ స్థాపనే జగనన్న హితం


మల్లంపేటలో ఇంటింటికీ వెళ్లి, పథకాలు వివరిస్తున్న ఎమ్మెల్యే శంబంగి

- 'గడప గడపకు మన ప్రభుత్వం'లో ఎమ్మెల్యే శంబంగి వెంకటచిన అప్పలనాయుడు

బాడంగి: సమసమాజ స్థాపనే సీఎం జగనన్న హితమని, అందుకే అర్హులైన వారందరికీ సంక్షేమ పథకాలు అందిస్తున్నారని ఎమ్మెల్యే శంబంగి వెంకటచిన అప్పలనాయుడు తెలిపారు. గురువారం మండలంలోని మల్లంపేటలో నిర్వహించిన గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో పాల్గొన్న ఎమ్మెల్యేకు గ్రామస్తులు ఘనస్వాగతం పలికారు. అనంతరం ఆయన ఇంటింటికీ వెళ్లి, నాలుగేళ్లుగా ప్రభుత్వం చేస్తున్న అభివృద్ధి, అమలు చేస్తున్న పథకాలను వివరించారు. ఏవైనా సమస్యలున్నా, అర్హులై ఉండి ఎవరికైనా పథకాలు అందకపోయినా వెంటనే తెలియజేయాలన్నారు. ఈ క్రమంలో పలువురు ఆయన దృష్టికి తీసుకువచ్చిన చిన్నచిన్న సమస్యలను పరిష్కరించాలని ఆయన ఆదేశించారు. అన్ని వర్గాలు ఆర్థికంగా బాగుపడాలన్న సదుద్దేశ్యంతోనే జగనన్న ప్రభుత్వం అనేక సంక్షేమ పథకాలు అమలు చేస్తోందన్నారు. ప్రస్తుతం అమలులోని ప్రభుత్వ పథకాలతో ప్రతి ఇంటికీ లబ్ధి జరుగుతోందన్నారు. కుల, మత, రాజకీయ పార్టీలకు అతీతంగా సంక్షేమ పథకాలు అందిస్తున్న ఘనత వైఎస్సార్ సీపీకే దక్కుతుందన్నారు. ప్రజల బాగోగుల కోసం అహర్నిశలు శ్రమిస్తున్న ఆయన పాలనపై ప్రతిపక్షాలు, ఎల్లోమీడియా పనిగట్టుకుని మరీ లేనిపోని ఆరోపణలు చేస్తున్నాయని విమర్శించారు. ఒకప్పుడు రాష్ట్రంలోని ఉచిత పథకాలతో రాష్ట్రం మరో శ్రీలంక, సోమాలియా అవుతుందని విమర్శించిన చంద్రబాబే మళ్లీ ఉచిత పథకాలతో మేనిఫెస్టో రూపొందించి, విడుదల చేయడం చాలా విడ్డూరంగా ఉందన్నారు. చంద్రబాబు మాయమాటలు మరోసారి నమ్మేందుకు ప్రజలు సిద్ధంగా లేరన్నారు. రాష్ట్ర జనమంతా సీఎం జగన్ వెంటే ఉన్నారని, ఆయననే మళ్లీ ముఖ్యమంత్రిని చేస్తారని తెలిపారు. కార్యక్రమంలో పార్టీ బొబ్బిలి మండల అధ్యక్షుడు శంబంగి వేణుగోపాలనాయుడు, జెడ్పీటీసీ సభ్యుడు పెద్దింటి రామారావు, జేసీఎస్ మండల కన్వీనర్ మరిపి శంకరరావు తదితరులు పాల్గొన్నారు.

'వలంటీర్లకు వందనం'


సత్కారం అందుకున్న వలంటీర్లతో సర్పంచ్ గోవిందరావు


వంగర: వలంటీర్లను సన్మానిస్తున్న ఎంపీడీఓ శ్రీనివాసరావు

రేగిడి: మండలంలోని పనుకువలస గ్రామంలో వలంటీర్లకు వందనం కార్యక్రమం గురువారం నిర్వహించారు. ఉత్తమ గ్రామ సచివాలయ వలంటీర్లను సేవామిత్ర, సేవారత్న పురస్కారాలతో సర్పంచ్ గోవిందరావు సత్కరించారు. భవిష్యత్‌లో కూడా ఇదే తీరుగా పనిచేసి, ప్రభుత్వానికి మంచిపేరు తీసుకురావాలని కోరారు.

వంగర: మండలంలోని శ్రీహరిపురం గ్రామ సచివాలయంలో వలంటీర్లకు వందనం కార్యక్రమం గురువారం నిర్వహించి, ఉత్తమ గ్రామ వలంటీర్లను సేవామిత్ర పురస్కారాలతో ఎంపీడీఓ శ్రీనివాసరావు సన్మానించారు.

యుద్ధప్రాతిపదికన బోర్ల మరమ్మతులు

సంతకవిటి: మండలంలోని జి.ఎస్.పురంలో పాడైన బోర్ల మరమ్మతులు గురువారం యుద్ధప్రాతిపదికన చేపట్టారు. వేసవి నేపథ్యంలో తాగునీటికి ఇక్కట్లు లేకుండా ప్రభుత్వ ఆదేశాల మేరకు చర్యలు తీసుకుంటున్నామని ఆర్‌డబ్ల్యూఎస్ ఈఈ సంతోష్ తెలిపారు.

రూ.2.80 లక్షలతో రోడ్డు నిర్మాణం

సంతకవిటి: మండలంలోని శ్రీహరినాయుడుపేటలో గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం నిధులు రూ.2.80 లక్షలతో రోడ్డు నిర్మాణం చేపడుతున్నారు. బీటీ రోడ్డు నుంచి శ్మశానం వరకు ఈ రోడ్డు పనులు జరుగుతుండగా, గురువారం ఎంపీడీఓ ఎస్.రఘునాధాచారి పనులను పరిశీలించారు. నాణ్యతా ప్రమాణాల మేర పనులు చేపట్టాలని ఆయన సూచించారు.

చురుగ్గా 'ఉపాధి' పనులు


రేగిడి: తాటిపాడు చెరువులో జరుగుతున్న పనులు పరిశీలిస్తున్న ఏపీఓ హరనాధరావు


రాజాం: వేతనదారులకు సూచనలిస్తున్న ఏపీఓ సాయిరాం


వంగర: వేతనదారుల మస్తర్లు పరిశీలిస్తున్న ఎంపీడీఓ శ్రీనివాసరావు

రేగిడి: మండలంలోని పలు గ్రామాల్లో ఉపాధి హామీ పనులు చాలా చురుగ్గా జరుగుతున్నాయి. తాటిపాడు గ్రామంలో సాగునీటి చెరువులు, కాలువల్లో చేపడుతున్న పనులను ఏపీఓ హరనాధరావు గురువారం పరిశీలించారు. రెండు పూటలా నిర్దేశిత కొలతల్లో పనిచేస్తే గిట్టుబాటు అయ్యే వేతనం లభిస్తుందన్నారు. జాబ్‌కార్డు ఉన్న వారినే పనులకు అనుమతించాలని, బోగస్ మస్తర్లు వేస్తే కఠిన చర్యలు తీసుకుంటామన్నారు. కార్యక్రమంలో టెక్నికల్ అసిస్టెంట్ రమణ తదితరులు పాల్గొన్నారు.

రాజాం: మండలంలోని కొఠారిపురం గ్రామ బల్లవాని చెరువులో జరుగుతున్న ఉపాధి హామీ పనులను ఏపీఓ సాయిరాం పరిశీలించారు. సక్రమంగా పనులు చేస్తే రోజుకు రూ.270 వేతనం లభిస్తుందన్నారు.

వంగర: మండలంలోని నీలయ్యవలస గ్రామంలో జరుగుతున్న ఉపాధి హామీ పనులను ఎంపీడీఓ వావిలపల్లి శ్రీనివాసరావు గురువారం పరిశీలించారు. వేతనదారుల మస్తర్లు చూసి, పనిలోకి వచ్చిన వారికే మస్తరు వేయాలని, కొలతల ప్రకారం రెండు పూటలా పనిచేయాలని ఎంపీడీఓ తెలిపారు.

నేడు విద్యుత్ వినియోగంపై అవగాహన సదస్సు

బొబ్బిలి: స్థానిక ఏపీ ఎన్‌జీవో హోమ్‌లో విద్యుత్ వినియోగం, పొదుపుపై శుక్రవారం అవగాహన సదస్సు నిర్వహిస్తున్నట్లు ఈపీడీసీఎల్ పూడి హరి గురువారం ఓ ప్రకటనలో తెలిపారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల ఆధ్వర్యంలో ఉదయం 10.30 గంటలకు జరిగే ఈ కార్యక్రమంలో మిషన్ లైఫ్ స్టైల్ ఫర్ ఎన్విరాన్‌మెంట్ ద్వారా విద్యుత్ ఎలా ఆదా చేయాలి, ఎలా విద్యుత్ వినియోగిస్తే కరెంట్ బిల్లు తక్కువ వస్తుందన్న అంశాలను వివరించనున్నామన్నారు.